సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 21 । ఆగస్టు । 2023



దిగొచ్చిన టమాట..

కొండెక్కిన టమాట ధరలు దిగొస్తున్నాయి. దిగుబడి పెరగడంతో మార్కెట్‌కు టమాలు వెల్లువలా వస్తున్నాయి. దీంతో ధరలు నేల చూపులు చూస్తున్నాయి. -8లో



తల్లి కర్మకాండకు వెళ్లి వస్తూ..

చెన్నూరు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ఈ ఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.400
రెండోరకం	రూ.220	రూ.310



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 283 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	553	553
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 74.920 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

రామయ్య సేవలో సమాచార కమిషనర్



ఆలయ రంగమండపంలో కుటుంబసభ్యులతో రాష్ట్ర సమాచార కమిషనర్ కట్టా జనార్దన్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో వెలసిన సీతారామలక్ష్మణులను ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ కట్టా జనార్దన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు. గర్భాలయంలోని మూల మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగమండపంలో తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఒంటిమిట్ట తహసీల్దార్ మధవీలత, ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు, ఒంటిమిట్ట ఎస్‌ఐ మధుసూదన్ రావు ఉన్నారు.

హార్సిలీహిల్స్‌పై జేసీ

బి.కొత్తకోట: జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదివారం బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. మధ్యాహ్నం ఇక్కడకు వచ్చిన ఆయన కొండపై ప్రకృతి అందాలను తిలకించారు. వ్యూపాయింట్లు, గాలిబండ, అటవీ సముదాయం సందర్శించారు. కొండపై విశేషాల గురించి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన కొండ నుంచి వెనుదిరిగి వెళ్లారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రం మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ 1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండలో సోమవారం వరుణయాగం, సహస్రఘట్టాభిషేకం నిర్వహించనున్న నేపథ్యంలో డిపో నుంచి ఉదయం 5, 6.20, 7.30 గంటలకు బస్సులు ఏర్పాటు చేశామన్నారు. దీంతోపాటు తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు బస్సులు షటిల్ తిరుగుతాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

30న తిరువన్నామలైకి..



కడప కోటిరెడ్డిసర్కిల్ : తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలై అరుణాచలగిరి ప్రదక్షిణ నేపథ్యంలో ఈనెల 30న జిల్లాలోని వివిధ డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 1, బద్వేలు 3, మైదుకూరు 2, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల డిపోల నుంచి ఒక్కొక్క సర్వీసును నడపనున్నామన్నారు.

- కడప డిపో నుంచి ఉదయం 5 గంటలకు (సర్వీసు నెం.6002) తిరుమన్నామలైకి బయలుదేరుతుందన్నారు.
- పులివెందుల డిపో నుంచి ఉదయం 8.00 గంటలకు (59900) సర్వీసు కంచి మీదుగా వెళుతుందన్నారు.
- ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 7.45 గంటలకు (98398) సర్వీసు బయలుదేరుతుందన్నారు.
- మైదుకూరు డిపో సర్వీసు (96786, 95678) ఉదయం 6.30 గంటలకు పోరుమామిళ్లలో, సాయంత్రం 6.00 గంటలకు మైదుకూరు నుంచి బయలుదేరుతాయన్నారు.
- బద్వేలు డిపో నుంచి (9569, 9580, 60009) పోరుమామిళ్లలో ఉదయం 5.00 గంటలకు, 5.30 గంటలకు, బద్వేలు 6.00 గంటలకు బస్సులు బయలుదేరుతాయన్నారు. ఈ సర్వీసులు పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళతాయన్నారు.
- జమ్మలమడుగు డిపో (98398) నుంచి రాత్రి 7.00 గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా తిరుమన్నామలైకు వెళుతుందన్నారు.

ఉప పోరులో ఫ్యాన్ హవా!

- వైఎస్సార్ జిల్లాలో 3 సర్పంచ్, 41వార్డులు స్థానాలు కైవసం
- అన్నమయ్య జిల్లాలో 2 సర్పంచ్‌లు, 45వార్డులు వైఎస్సార్‌సీపీకే
- సర్పంచ్ స్థానాల్లో ఉనికిని చాటుకోలేని టీడీపీ
- రెండు జిల్లాల్లో కలిపి 10వార్డు స్థానాలకు మాత్రమే పరిమితం
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో ఊసేలేని జనసేన



ముద్దనూరు మండలం కొలవలి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న బొలిశెట్టి మారుతి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప: స్థానిక సంస్థల ఉప పోరులోనూ వైఎస్సార్‌సీపీ హవా స్పష్టంగా కన్పించింది. పంచాయతీ ఎన్నికల్లో ఒక చోట మాత్రమే పోటీ చేసిన తెలుగుదేశం పార్టీ అక్కడ కూడా అభాసుపాలైంది. రెండు జిల్లాల్లో కలిపి 10వార్డులకు మాత్రమే పరిమితమైంది. ఇక జనసేన పార్టీ ఊసే కన్పించలేదు. ఎక్కడ కూడా ఆ పార్టీ మద్దతుదారులు పోటీ చేయలేకపోయారు. వైఎస్సార్ జిల్లాలో 3 స్థానాలు, అన్నమయ్య జిల్లాలో 2 స్థానాలు కలిపి 5 సర్పంచ్ స్థానాలతోపాటు 86 వార్డు మెంబర్లను వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు దక్కించుకున్నారు. కె సుగమంచిపల్లె సర్పంచ్ స్థానానికి మూకుమ్మడిగా రాజకీయ పార్టీలు దూరంగా ఉండిపోయాయి.

పచ్చశ్రేణులు బోడి గుండుకు మోకాలికి ముడిపెట్టడంలో దిట్టగా పరిగణిస్తున్నాయి. పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఎదురుగాలి, ప్రతిపక్ష పార్టీ వీరోచిత పోరాటం చేసిందంటూ రెండు రోజులుగా ఊదరగొడుతున్నాయి. వాస్తవాలను పరిశీలిస్తే అందుకు భిన్నంగా ఫలితాలు రికార్డులకెక్కాయి. వైఎస్సార్ జిల్లాలో 4 సర్పంచ్, 65 వార్డు స్థానాలకు నోటిఫికేషన్ జారీ అయ్యింది. అందులో కొండాపురం మండలం కె సుగమంచిపల్లె మినహా 3 చోట్ల సర్పంచ్‌లకు పోటీ నిర్వహిస్తే పెద్దముడియం మండలం మేడిదిన్నె, వేంపల్లె మండలం ఇడుపులపాయ సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవంగా వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. ముద్దనూరు మండలం కొలవలిలో ఎన్నికలు నిర్వహించారు. అందులో వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపిన బొల్లిశెట్టి మారుతీ 589 ఓట్లు విజయదుందుభి మోగించింది. 41 వార్డు స్థానాలు దక్కించుకోగా, 5వార్డులకు మాత్రమే టీడీపీ పరిమితమైంది. మరో 15 వార్డు స్థానాల్లో పోటీకి దూరంగా ఉండిపోయారు. వాస్తవం ఇలా ఉంటే టీడీపీ వీరోచితంగా పోరాటం చేసినట్లు ఎల్లో మీడియా బాకా ఊదడం గమనార్హం.



ఇడుపులపాయ సర్పంచ్ నాగమ్మ



మేడిదిన్నె సర్పంచ్ శాంతన్‌కుమార్‌రెడ్డి




ఆకేపాడు గ్రామ సర్పంచ్ మురళి



గుర్రంవాండ్లపల్లె సర్పంచ్ బి.సుధాకర్

అన్నమయ్య జిల్లాలోనూ అదే హవా...

అన్నమయ్య జిల్లాలో 2 సర్పంచ్ స్థానాలకు 52వార్డు మెంబర్లకు (రాజంపేట పరిధిలో వైఎస్సార్ జిల్లాలో నాలుగు వార్డులు కలిపి) ఉప ఎన్నికలు నిర్వహించారు. అందులో 2 సర్పంచ్ స్థానాలను వైఎస్సార్‌సీపీ ఏకగ్రీవంగా కైవసం చేసుకుంది. 52 వార్డు మెంబర్లకు గాను 45 వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. 5 స్థానాలు తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు దక్కించుకున్నారు. ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించగా, మరో స్థానంలో వీరబల్లె మండలంలో వార్డుకు పోటీకి దూరంగా ఉండిపోయారు. అటు వైఎస్సార్, ఇటు అన్నమయ్య జిల్లాలో టీడీపీ కేవలం ఉనికి మాత్రమే కన్పించింది. జనసేన పార్టీ ఊసే లేకుండా పోయింది. ఆ పార్టీ మద్దతుదారులు ఎక్కడా పోటీలో కన్పించలేదు. స్థానిక పరిస్థితుల ప్రభావంతో వార్డు మెంబర్లు రెండు చోట్ల పోటీలో గెలుపొందిన టీడీపీ జబ్బలు చరుచుకోవడం వింతగా ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



నాటి నుంచి నేటి వరకూ అదే స్పీడు...

వైఎస్సార్‌సీపీ 2019 స్థానిక ఎన్నికల్లో విజయ దుందుభి ప్రదర్శించింది. అదే స్పీడ్‌తో స్థానిక సంస్థల ఎన్నికలల్లో ఆధిపత్యం చూపించింది. ప్రత్యక్ష పోరాటంలో అన్నీ ఎమ్మెల్యేలు, రెండు పార్లమెంటు స్థానాలను దక్కించుకుంది. అదే ఊపులో తర్వాత వచ్చిన ఎన్నికల్లో కూడ కనబరచింది. మండల పరిషత్‌లు, జెడ్పీ చైర్మన్ గిరి, మున్సిపల్ చైర్మన్లు, మేయర్ పదవుల్ని వైఎస్సార్ సీపీ అలవోకగా దక్కించుకొని తనకు ఎదురు లేదని సత్తా చాటింది. స్థానిక సంస్థలల్లో పోటీ చేసేందుకు కూడా టీడీపీ శ్రేణులు ఉత్సాహం చూపలేని స్థితికి ఫ్యాన్ హవా చేరింది. నాలుగేళ్ల తర్వాత పంచాయతీలు, వార్డులకు వచ్చిన ఉప పోరు లోనూ మరోమారు సత్తా చాటుకొని తిరుగులేని దిశగా వైఎస్సార్‌సీపీ నిలించిందని పరిశీలకులు భావిస్తున్నారు.

నేడు నాగుల పంచమి



జమ్మలమడుగురూరల్: ముద్దనూరు రహదారిలో ఉన్న ఆలయంలో భక్తుల పూజలు

కడప కల్చరల్ : శ్రావణమాసం వచ్చిందంటే చాలు ఆధ్యాత్మిక భావన ఉట్టిపడుతుంటుంది. ఆదివారం నాగుల చవితిని జరుపుకున్న మహిళలు సోమవారం నాగ పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. మన దేశంలో పామును దేవతగా పూజించే సంప్రదాయం ఉండడం విశేషం . అందుకే మహిళలు నాగుల చవితి, నాగపంచమి రోజులతోపాటు ఇతర ప్రత్యేకమైన రోజుల్లో పుట్టలకు పూజలు చేస్తుంటారు. మనిషిని భయపెట్టే పాములకు మన సంస్కృతిలో దేవతల స్థానం ఇవ్వడం ఆసక్తిదాయకం. వేల సంవత్సరాల నాటి ఈ సంప్రదాయం నేటికీ కొనసాగుతూనే ఉంది. అందుకే పలువురు తమ పేర్ల ముందు నాగ, శేష అని పెట్టుకుంటారు.

కాపాడు నాగన్నా........

వర్షాకాలం సీజన్‌లో పాములెక్కువగా కనిపిస్తాయి. కన్నాలు, కలుగులు, పుట్టలు వర్షపు నీటితో నిండిపోతాయి. చాటున్న సురక్షిత ప్రాంతాల కోసం పాములు వెతుక్కుంటాయి. గ్రామాల్లో దుక్కులు చేసుకుని నార్లు వేసుకునే సమయం గనుక పొలానికి నీళ్లు కట్టుకోవడానికి రైతులు రాత్రి వేళల్లో కూడా వెళ్లవలసి వస్తుంటుంది. ఈ సీజన్‌లో పాములు బయట తిరుగుతాయి గనుక చీకట్లో కనిపించక తొక్కితే కాటు వేయవద్దని, క్షమించి వదిలి వేయాలని పాములను నాగదేవతలుగా భావించి ప్రజలు పుట్టల వద్ద పూజలు చేస్తారు. శ్రావణమాసంలో నాగుల చవితి, నాగ పంచమిగా పుట్టల వద్ద పూజలందుకునే విధానమే అందుకు నిదర్శనం.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉపాధి హామీ పథకంలో వంద దినాలు పూర్తయిన కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు డీడీయూజీకేవై పథకం ద్వారా సీడ్యాప్ సౌజన్యంతో ఉచిత శిక్షన ఇవ్వనున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఉన్నతి స్కీంలో భాగంగా కంప్యూటర్, హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో నాలుగు నెలల కాలవ్యవధిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణానంతరం కేంద్ర ప్రభుత్వంతో గుర్తించబడిన సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు.ఆసక్తి కలిగిన వారు కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 90630 82227 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

23న సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ ముట్టడి

కడప ఎడ్యుకేషన్: హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 23న పీడీఎస్‌యూ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో తాడేపల్లిలోని రాష్ట సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టనున్నట్లు పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం కడపలో విడుదల చేశారు.

రాజంపేట రైల్వేస్టేషన్‌కు
అమృతభాగ్యం!

- స్టేషన్ ఆధునీకరణకు మోక్షం
- అమృతభారత్ స్కీంలోకి రాజంపేటకు చోటు
- రూ.2కోట్లకుపైగా వ్యయంతో ఆధునీకరణపనులు
- పీవోజీకి లిఫ్ట్, ప్లాట్‌ఫాం కవరింగ్ షెడ్స్ నిర్మాణం
- డీపీఆర్‌ను సిద్ధంచేసిన గుంతకల్ డివిజన్ ఇంజనీర్లు
- స్టేషన్ కమర్షియల్‌లో రోజుకు రూ.లక్షకుపైగా ఆదాయం



రాజంపేట రైల్వేస్టేషన్



రైలుమార్గం: చెన్నై-ముంబాయి

స్టేషన్ : రాజంపేట

గ్రేడ్ : ఎన్ఎస్‌జీ -5

డైలీ ట్రైన్స్ : 16

నాన్‌డైలీ ట్రైన్స్ : 12

ప్యాసింజర్స్ : 4

రాజంపేట: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో రాజంపేట రైల్వేస్టేషన్‌కు చోటు దక్కించుకుంది. దీంతో ఈ స్టేషన్ ఆధునీకరణకు మోక్షం లభించింది. ప్రయాణీకులను ఆకర్షించేలా అన్ని వసతులను కల్పించనున్నారు. మార్చిలో జరిగిన 2023-2024 సాధారణ బడ్జెట్‌లో సమావేశాల్లో ఈ పథకాన్ని తీసుకొచ్చారు. కాగా ఈ స్టేషన్ మీదుగా రోజు 16 , వారాంతపురైళ్లు 12 , ప్యాసింజర్ రైళ్లు 4 నడుస్తున్నాయి.

ఎన్ఎస్‌జీ-5 స్టేషన్‌గా...

పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట రైల్వేస్టేషన్ ఎన్ఎస్‌జీ(నాన్ సబర్బన్ గ్రేడ్-5గా కొనసాగుతోంది. నెలకు లక్షలాదిరూపాయిలు ఆదాయం ఎర్నింగ్స్ ద్వారా రైల్వే వస్తోంది. అన్ని రైళ్లకు హాల్టింగ్ కొనసాగిన క్రమంలో లోడింగ్ వల్ల ఆదాయం బాగా వుండేది. నిమ్మతోపాటు పలురకాల వస్తువులు, ఉద్యానవనపంటలుతో పాటు చెన్నై, హైద రాబాదు, ముంబాయి, ఎర్నాకులం,ఢిల్లీ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు, దిగుమతులు ఉండేవి.

రైళ్ల హాల్టింగ్‌కు ఎంపీ తన వంతుగా కృషి...

రైళ్ల హాల్టింగ్‌కు ఎంపీ మిథున్‌రెడ్డి తన వంతుగా కృషిచేస్తున్నారు. ఇటీవల రైల్వేమంత్రిత్వశాఖ మంత్రినికలిసి రాజంపేట రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్ అంశాన్ని తీసుకొని అమలుచేయాలని కోరారు. కోవిడ్ ముందు ఏ విధంగా రాజంపేట రైల్వేస్టేషన్‌ల్లో రైళ్ల హాల్టింగ్ కొనసాగిందో అదే విధంగా పునరుద్దరణ చేయాలని రైల్వేని కోరుతూ వస్తున్నారు. రాజంపేట స్టేషన్ అభివృద్ధికి ఎంపి మిథున్‌రెడ్డి కృషిచేస్తున్నారు. ఇందులో భాగమే రాజంపేట అమృత భాగ్యం లభించడమంటున్నారు.

అమృత్‌భారత్ స్కీం కింద ఏవేవి చేపడతారు...

రాజంపేట రైల్వేస్టేషన్‌లో అమృతభారత్‌స్టేషన్ స్కీం కింద రైల్వేస్టేషన్‌లో వసతులకు సంబంధించి నిర్మాణాలను చేపట్టా లనే అంశంపై డీటైల్ ప్రాజెక్టు రిపోర్టుకు గుంతకల్ ఇంజనీర్లు సన్నహాలు చేస్తున్నారు.

- రెండు ప్లాట్‌ఫాంల మధ్య ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి లిఫ్టులు ఏర్పాటు
- ఆఫీసర్స్ రెస్ట్ హౌస్, ఓపన్‌వెయింటింగ్ హాల్, స్టేషన్ పరిసరాలు అభివృద్ధి
- రెండు ప్లాట్‌ఫాంలో ప్రయాణీకుల నీడ కోసం కవరింగ్‌షెడ్స్ నిర్మాణం
- వివిధ రైళ్ల ఫార్మసిస్ కోచ్ పొజిషన్ బోర్డులను ఏర్పాటుచేశారు.

అభివృద్ధి పనులు సంతోషకరం



రాజంపేట రైల్వేస్టేషన్‌ను అమృత్‌భారత్‌స్టేషన్ల స్కీంలో చేర్చడం సంతోషకరం, ఈ పథకం కింద సరికొత్త పనులు చేపట్టనున్నారు. ప్రయాణీకుల వసతి సౌకర్యాల కల్పించే విధంగా ఆధునీకరణపనులు ఉంటాయి. ఇప్పటికే అమృత్‌భారత్ స్టేషన్ల స్కీం కింద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు అంచనాలు వేస్తున్నారు.

-సిరాల వెంకటసుబ్బయ్య, ఎస్ఎంఆర్, రాజంపేట

అభివృద్ధితోపాటు రైళ్ల హాల్టింగ్ కల్పించాలి



అమృత్‌భారత్ రైల్వేస్టేషన్ల స్కీంలో రాజంపేట రైల్వేస్టేషన్‌కు చోటు కల్పించడం ఆనందకరం. అన్ని రైళ్లను ఇక్కడ ఆపే విధంగా రైల్వేబోర్డు నిర్ణయం తీసుకోవాలి. ఆర్వోబి నుంచి స్టేషన్‌లోకి వెళ్లే విధంగా పాత్ కల్పించాలి. దీన్ని కూడా అభివృద్ధిలోకి తీసుకోవాలి. అలాగే ప్రయాణీకుల సౌకర్యం రిటైరింగ్‌రూంలు నిర్మించాలి.

- పిల్లి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ, రాజంపేట

'కొత్త' కార్డులొచ్చాయి

- జిల్లాకు 7249 రేషన్ కార్డులు
- వచ్చేనెల నుంచి బియ్యం

రాయచోటి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనను సాగిస్తోంది. ఇందులో భాగంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తూ వారి సంక్షేమం కోసం పాటుపడుతోంది. గతంలో రేషన్ కార్డును పొందాలంటే సంవత్సరాల తరబడి ప్రభుత్వ ప్రకటన కోసం వేచి చూడాల్సి వచ్చేది. అదే స్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం దక్కేది కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో ప్రతి ఆరు నెలలకు ఒకసారి రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. వలంటీర్లతో అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులను దరఖాస్తులు చేయించడమే కాకుండా మంజూరైన కార్డులను నేరుగా ఇళ్లకు తీసుకొచ్చి ఇవ్వడం, లేదా స్థానిక ప్రజాప్రతినిధులు చేతులు మీదుగా అందివ్వడం పరిపాటిగా మారింది. ఇందులో భాగంగా జిల్లాలోని 30 మండలాలకు మంజూరైన 7,249 రేషన్ కార్డులను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కొత్తగా వివాహమైన దంపతులకు, ఉమ్మడి కుటంబం నుంచి విడిపోయి వేరే కాపురం పెట్టినవారికి తక్షణం రేషన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది.

డివిజన్లవారీగా..



జిల్లాలోని 30 మండలాల్లో ప్రస్తుతం 4,95,780 కార్డులు ఉన్నాయి. వీటికి ప్రతి నెల 6,716 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నారు. అలాగే తక్కువ ధరలకు కందిపప్పు, పంచదార ఇంటివద్దకే రేషన్ వాహనాలు ద్వారా సరఫరా చేస్తున్నారు. గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 7249 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశారు. రాయచోటి రెవెన్యూ డివిజన్ 10 మండలాలకు 2123 రేషన్ కార్డులు, రాజంపేట రెవెన్యూ డివిజన్ 09 మండలాలకు 2051 రేషన్ రేషన్ కార్డులు, మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాలకు 3075 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీరికి సెప్టెంబర్ నెల నుంచి రేషన్ అందజేస్తారు.



లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, జెడ్పీ చైర్మన్ అమరనాథరెడ్డి

మండలం	కొత్తవి	స్పిట్ కార్డులు
బి కోడూరు	123	170
కలికిరి	79	137
కురబలకోట	103	136
ములకల చెరువు	93	114
నిమ్మనపల్లి	83	97
పెద్దమండెం	50	88
పేటీఎంఎస్	113	162
రామసముద్రం	65	127
తంబళ్లపల్లి	87	121
వాల్మీకిపురం	77	140
చిట్వేలి	89	60
కోడూరు	182	129
నందలూరు	59	63
ఓబులవారిపల్లె	122	79
పెనగలూరు	132	81
పుల్లంపేట	137	66
రాజంపేట	220	164
టి సుండుపల్లె	147	130
వీరబల్లి	83	108
చిన్నమండెం	56	100
గాలివీడు	104	123
గుర్రంకొండ	67	153
కలకడ	71	91
కెవీపల్లి	104	95
లక్కిరెడ్డిపల్లె	43	52
పీలేరు	151	161
రామాపురం	75	64
రాయచోటి	197	242
సంబేపల్లి	62	112

సంవత్సరాలుగా ఎదురుచూడాల్సి వచ్చేది



గతంలో కొత్తరేషన్ కార్డును పొందాలంటే సంవత్సరాలపాటు వేచి చూడాల్సి వచ్చేది. నేడు ప్రతి ఆరు నెలలకు ఒకసారి అర్హత ఉన్న వారికి వలంటీరు దరఖాస్తు చేయించి కార్డులను ఇండ్లకు తెచ్చి ఇస్తున్నారు.

- ఎస్ ఫయాజ్ అహ్మద్, రాయచోటి

వచ్చే నెల నుంచి సరుకులు ఇస్తాం

కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి సెప్టెంబర్ నెల నుంచి ఉచిత బియ్యం, తక్కువ ధరకు చక్కెర, కందిపప్పు అందజేస్తాం. ఇప్పటికే జిల్లాలో 4,95,780 కార్డులకు 6,716 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతినెల రేషన్ కార్డులకు సరుకుల పంపిణీ జరుగుతుంది.

-రఘునాథ, జిల్లా సివిల్ సప్లై అధికారి, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరికి పాముకాటు

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు పాము కాటుకు గురై తీవ్ర అస్వస్థత పాలయ్యారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం బేరిమంగళంకు చెందిన రమణ భార్య డి.లీలావతి(38) పొలం పనులు చేసుకుంటుండగా, పాము కాటుకు గురైంది. ఆమెను కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదే విధంగా నిమ్మనపల్లె మండలం సామకోటవారిపల్లెకు చెందిన సి.రెడ్డెప్ప(43) పొలం వద్ద పశువులకు గడ్డి కోస్తుండగా, పాము కాటు వేసింది. బాధితుడిని కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సలీం బాషా (ఫైల్)

పులివెందుల రూరల్ : పట్టణంలోని బ్రాహ్మణపల్లెకు వెళ్లే రహదారిలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో సలీం బాషా (45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

పట్టణంలోని జెండామాను వీధికి చెందిన ఖాసీం, బీబీజాన్‌ల కుమారుడు సలీం బాషా పట్టణంలోని సంతోషిమా హోటల్‌లో వంట మనిషిగా పని చేసే వాడు. ఆదివారం పని నిమిత్తం పులివెందుల నుంచి ద్విచక్రవాహనంలో బ్రాహ్మణపల్లెకు వెళుతుండగా.. దారి మధ్యలో వాహనం అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య బీబీ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి యత్నించి.. పట్టుబడి

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని ఓ ప్రైవేటు గోల్డ్‌లోన్ సంస్థలో ఆదివారం తెల్లవారుజామున చోరీకి యత్నిస్తూ ఓ అంతర్ రాష్ట్ర దొంగ పోలీసులకు పట్టుబడ్డాడు. చోరీకి యత్నించే సమయంలో సైరన్ మోగడంతో.. అప్పటికే అదే ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు.. సిబ్బందిని అప్రమత్తం చేసి దొంగను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఈ దొంగపై తెలుగు రాష్ట్రాల్లో 60కు పైగా దొంగతనాల కేసులు నమోదైనట్లు తెలిసింది. ప్రస్తుతం కడప సీసీఎస్ పోలీసులు, అర్బన్ పోలీసులు, సబ్ డివిజన్ ఐడీ పార్టీ పోలీసులు అతన్ని విచారణ చేస్తున్నట్లు తెలిసింది. నేడో, రేపో మీడియా ముందు హాజరుపరిచి అరెస్టు చూపనున్నట్లు సమాచారం.

దిగొచ్చిన టమాట.. సామాన్యుడికి ఊరట

కొండెక్కి కూర్చొన్న టమాట దిగి వస్తోంది.. దిగుబడి పెరగడంతో మార్కెట్‌కు స్టాక్ భారీగా వస్తోంది. దీంతో ధరలు తగ్గుతున్నాయి.. ఫలితంగా సామాన్యులకు ఊరట లభిస్తోంది.

- మార్కెట్‌లో కిలో రూ.30 నుంచి రూ.40
- 15 రోజుల్లో 50 శాతానికి పైగా తగ్గిన ధరలు
- అనంతపురం జిల్లా నుంచి భారీగా దిగుమతి


మార్కెట్‌లో రవాణాకు సిద్ధంగా ఉన్న టమాటలు

గుర్రంకొండ : మార్కెట్‌లో టమాట ధరలు భారీగా పతనమవుతున్నాయి. ప్రస్తుతం కిలో రూ.30 నుంచి రూ.40 వరకు మాత్రమే పలుకుతున్నాయి. 15 రోజుల క్రితం రూ.80 నుంచి రూ.100 వరకు ఉన్నాయి. ప్రస్తుతం 50 శాతానికి పైగా తగ్గాయి. మొదటి రకం కిలో రూ.40, రెండో రకం రూ.30, మూడో రకం రూ.20 వరకు పలుకుతున్నాయి. పక్కనున్న ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో టమాట పంట దిగుబడి భారీగా పెరగడమే ఇందుకు కారణమని వ్యాపార వర్గాలు అంటున్నాయి. దీంతో రోజురోజుకు ధరలు తగ్గుతుండటం గమనార్హం.

అన్నమయ్య జిల్లాలో తోటలకు వైరస్ దెబ్బ

15 రోజుల కిందట 25 కేజీల క్రేట్ రూ.2000 నుంచి రూ.2500 వరకు పలికింది. ప్రస్తుతం రూ.750 నుంచి రూ.1000 వరకు మాత్రమే పలుకుతోంది. నెలన్నరగా ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో రోజూ 2 లక్షల నుంచి 2.50 లక్షల క్రేట్ల స్టాక్ మండీలకు వస్తోంది. దీంతో అక్కడి మండీలు నిండిపోతున్నాయి. అక్కడి నుంచి ఇతర జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. ప్రధానంగా పక్కనే ఉన్న అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, గుర్రంకొండ, అంగళ్లు, ములకలచెరువుకు భారీగా వస్తోంది. కావున ఇక్కడి మార్కెట్‌యార్డు మండీలలో ధరలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. దీనికి తోడు అన్నమయ్య జిల్లాలోని టమాట తోటల్లో ఊజీ, వైరస్‌లు ఎక్కువగా సోకడంతో నాణ్యత పడిపోయింది. ఓ వైపు తోటలు దెబ్బతినడం, మరోవైపు ఉమ్మడి అనంతపురం జిల్లాల నుంచి దిగుబడి పెరగడంతో అన్నమయ్య జిల్లా రైతులు నష్టపోతున్నారు. బయటి రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యాపారులు పక్క జిల్లాలకు తరలిపోతున్నారు.

అనంతపురం ఎఫెక్ట్



ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో వస్తున్న టమాట పంట దిగుబడులతో అన్నమయ్య జిల్లాలో ధరలు తగ్గిపోతున్నాయి. నెలన్నరగా ఆ జిల్లాల్లో రోజురోజుకు టమాట దిగుబడి పెరిగిపోతోంది. అక్కడి మండీలకు రోజూ 2 లక్షల క్రేట్లు వస్తున్నాయని అంచనా. ఈ ఎఫెక్ట్ మన జిల్లా ధరలపై పడింది. దీంతో 15 రోజులుగా తగ్గుతూ వస్తున్నాయి. గత 20 రోజుల ధరలతో పోల్చితే ప్రస్తుతం 50 శాతానికి పైగా తగ్గిపోయాయి.

– జగదీష్, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


యశ్వంత్‌కుమార్ (ఫైల్)

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి మండలంలో జరిగింది. చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన శివశంకర్ కుమార్తె పల్లవిని బెంగళూరు నార్త్ వైట్‌ఫీల్డ్ గాంధీపుర మసీదు వీధికి చెందిన అంజనప్ప కుమారుడు బి.ఎ.యశ్వంత్‌కుమార్‌కు ఇచ్చి ఆరు నెలల క్రితం వివాహం జరిపించారు. పల్లవి గర్భం దాల్చడంతో నెలరోజుల క్రితం పుట్టినిల్లు అయిన కృష్ణాపురానికి వచ్చింది. శనివారం యశ్వంత్‌కుమార్ భార్యను చూసేందుకు ద్విచక్రవాహనంలో బెంగళూరు నుంచి కృష్ణాపురం వచ్చాడు. కొద్దిసేపు ఇంటి వద్ద గడిపిన అనంతరం రాత్రి 9.45 గంటలకు వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వచ్చాడు. తిరిగి కృష్ణాపురానికి వెళుతుండగా మదనపల్లె–బోయకొండ రోడ్డులోని వలసపల్లె సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ప్రమాదంలో కిందపడిన యశ్వంత్‌కుమార్‌కు తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలతో పడి ఉన్న యశ్వంత్‌కుమార్‌ను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

చిరుత కాదది.. అడవిపిల్లి


పాదముద్రలు పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు


అడవిపిల్లి పాదముద్ర

ములకలచెరువు : మండలంలోని నాయనచెరువుపల్లి పంచాయతీ ఉంగరాళ్లపల్లెలో సంచరించినది చిరుతపులి కాదని, అడవిపిల్లి అని అటవీ శాఖ అధికారులు తేల్చి చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి 8 గంటల ప్రాంత్రంలో ఒక పిల్లిని ఎత్తుకు పోయిన జంతువును చూసిన వారు.. చిరుతపులి అంటూ పుకార్లు సృష్టించడంతో గ్రామస్తులు బెంబేలెత్తారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు భయభ్రాంతులకు గురయ్యారు. ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న ఫారెస్టు బీటు అధికారులు సుధాకర్, గోపాల్ ఉంగరాళ్లపల్లెకు చేరుకొని గ్రామస్తులను విచారణ చేశారు. గ్రామానికి చెందిన మణికంఠ ఇంటికి అమర్చిన సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు. అందులో సక్రమంగా కనిపించకపోవడంతో పాదముద్రలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. పాదముద్రల ఆధారంగా అడవిపిల్లిగా నిర్ధారించారు. భయపడాల్సిన అవసరం లేదని గ్రామస్తులకు తెలియజేశారు. చుట్టుపక్కల దగ్గరలో అడవి ప్రాంతం లేదని, ఇక్కడ పులుల సంచారం ఉండదని చెప్పారు. రెండు, మూడు రోజుల పాటు గస్తీ నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.

ప్రేమికుల ఆత్మహత్య

వారంలో వేరొకరితో అమ్మాయి వివాహం


కల్యాణి (ఫైల్)


భాకరాపేట అడవిలో ఉరివేసుకున్న కల్యాణి, యుగంధర్

రామసముద్రం : వారంలో అమ్మాయికి వివాహం చేసేలా పెద్దలు నిశ్చయించారు. అంతలోపే అమ్మాయి ప్రేమికుడితో కలిసి వెళ్లిపోయి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం మానేవారిపల్లి పంచాయతీ చిట్టెంవారిపల్లికు చెందిన బొడె కళ్యాణి(17) తిరుపతి సమీపంలోని భాకరాపేట అడవిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రామసముద్రం మండలం మానేవారిపల్లి పంచాయతీ చిట్టెంవారిపల్లి గ్రామానికి చెందిన రమణ, రజినిల కుమార్తె బి.కల్యాణి(17) చిత్తూరు జిల్లా పుంగనూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే అదే కళాశాలలోనే చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం లద్దిగం గ్రామానికి చెందిన యుగంధర్(17) కూడా చదువుతున్నాడు. వారిద్దరూ కలిసి ప్రేమలో పడ్డారు. ఈ నేపథ్యంలో అమ్మాయికి వివాహం చేయాలని కుటుంబీకులు నిశ్చితార్థం చేశారు. ఈ నెల 26న వివాహం జరగాల్సి ఉండగా కల్యాణి శుక్రవారం నుంచి కనిపించకుండా పోయింది. చుట్టు పక్కల, బంధువుల ఊర్లలో విచారణ చేసినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు శనివారం రామసముద్రం పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం అయినట్లు ఫిర్యాదు చేశారు. అయితే ఆదివారం తిరుపతి జిల్లా భాకరాపేట ఘాట్ రోడ్డులోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద అడవిలో యుగంధర్, కల్యాణిలు చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతుండటం పశువుల కాపరుల కంట పడ్డారు. సమాచారం తెలుసుకున్న అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చంద్రగిరి సీఐ రాజశేఖర్, ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా కల్యాణికి ఇంక వారంలో వివాహం ఉండగా.. ఇలా ఆత్మహత్య చేసుకోవడంపై కుటుంబీకులు బోరున విలపిస్తున్నారు.

జూదరుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక హోమస్‌పేటలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రి సమీపంలో పేకాట ఆడుతున్న 12 మందిని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక్కడ పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో.. త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. 12 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.1,28,150 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు ఆర్‌ఎం కార్యాలయం వద్ద హాజరు కావాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తూ 2014 సెప్టెంబర్ 1కి ముందు రిటైర్డ్ అయిన వారందరూ సోమవారం ఉదయం 11 గంటలకు కడప ఆర్‌ఎం కార్యాలయం వద్ద హాజరు కావాలని ఆ సంస్థ వైఎస్సార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, ఎల్.రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రిటైర్డ్ అయిన వారందరికీ ఉద్యోగ జీవన భృతి కింద రూ.8 వేలు ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించామని వారు పేర్కొన్నారు.

బాలలపై చదువుల బాబు 'కథల వాన'

డాక్టర్ హరికిషన్


డాక్టర్ హరి కిషన్‌ను సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు, బాల సాహిత్యవేత్త చదువుల బాబు నేటితరం చిన్నారులపై విలువలతో కూడిన కథల వర్షం కురిపిస్తున్నారని ప్రముఖ కథా రచయిత, కర్నూలుకు చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ ఎం.హరికిషన్ తెలిపారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో 123వ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 'డీకే చదువులబాబు జీవితం–సాహిత్యం' అనే అంశంపై మాట్లాడారు. చదువులబాబుగా పేరుగాంచిన ఖాసింబాబు ప్రొద్దుటూరులో ఉంటూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారని తెలిపారు. నిత్యం బాలలతో మమేకం అయ్యే అవకాశం ఉండడంతో చిన్నారుల అవసరాలు, మనస్తత్వం, ప్రవర్తన తదితరాలపై అవగాహన పెంచుకున్నారని, ఆ అంశాలనే కథలుగా మలిచారని తెలిపారు. భావి భారత పౌరులపైనే సమాజం ఆధారపడి ఉందని, వారిలో నైతిక విలువలు పెంచేందుకు ఆయన తన కథల ద్వారా కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. చదువులబాబు 1983లో 'బల్లి తన పాటెరుగదు' కథతో రచయితగా ప్రస్తానం ప్రారంభించారని, నాలుగు దశాబ్దాలుగా అన్ని ప్రముఖ, దిన, వార, మాసపత్రికల్లో వందలాది కథలు రాశారని, ప్రత్యేకించి బాల సాహిత్యంలో విశేష కృషి చేశారని తెలిపారు. కథలతోపాటు కొన్ని నవలలు, నాటికలు కూడా రాశారని తెలిపారు. ఉపాధ్యాయునిగా రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్నారని, ఆయన రాసిన బాలల కథల సంపుటం 'వజ్రాలవాన'కు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా చదువులబాబు స్పందిస్తూ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. అనంతరం వక్త డాక్టర్ హరికిషన్‌ను సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి, పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, లైబ్రరీ అసిస్టెంట్లు హరిభూషణ్, రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, మౌనిక, గానుగపెంట హనుమంతరావు, అలపర్తి పిచ్చయ్య చౌదరి, కొత్తపల్లె రామాంజనేయులు, డాక్టర్ తవ్వా వెంకటయ్య, భూపతి రాయల్, ముడియం కిషోర్, రాజారెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధక విద్యార్థులు, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, సాయిబాబా, రామ్మోహన్‌రెడ్డి, మునికుమార్, ఖలందర్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లి కర్మకాండకు వెళ్లి వస్తూ.. తిరిగిరాని లోకాలకు..

- చెన్నూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం
- ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి కారణమైన లారీ


కృష్ణ, పద్మావతి, విజయరాణి గుర్తింపు కార్డులు


విజయరాణి, పద్మావతి ఆధార్ కార్డులు

చెన్నూరు : హైదరాబాద్ నుంచి తల్లి కర్మకాండకు తిరుపతికి వెళ్లారు. కార్యక్రమం తర్వాత తిరుగు పయనమయ్యారు. మార్గంమధ్యలో మృత్యువు కబళించడంతో తిరుగురాని లోకాలకు వెళ్లారు. వైఎస్‌ఆర్ జిల్లా చెన్నూరు వద్ద ఆదివారం మిట్ట మధ్యాహ్నం రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో.. విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌కు చెందిన కొండేటి కృష్ణ అక్కడే ఫైనాన్స్ కంపెనీ నడుపుతున్నారు. ఆయన తల్లి కర్మకాండ నిమిత్తం తిరుపతికి కుటుంబంతో సహా కారులో వచ్చారు. అక్కడ కార్యక్రమం ముగించుకున్నారు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. చెన్నూరు వద్ద కడప –కర్నూలు జాతీయ రహదారిలోని గోసుల కల్యాణ మండపం సమీపంలోని ఆంధ్ర స్పైస్ రెస్టారెంట్ దగ్గర ఆగి ఉన్న లారీని ఢీకొంది. లారీ కిందికి కారు దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కొండేటి కృష్ణ (48), కృష్ణ అత్త పద్మావతి (60), కృష్ణ కుమారుడు రిషి (15) ముగ్గురు అక్కడికి అక్కడే మృతి చెందారు. కృష్ణ భార్య విజయరాణి (38), కుమార్తె నిహారిక (19) తీవ్రంగా గాయపడ్డారు. కాగా విజయరాణి.. కృష్ణ నడుపుతున్న ఫైనాన్స్ కంపెనీలోనే అసిసెంట్ మేనేజర్‌గా చేస్తున్నారు. రిషి పదో తరగతి చదువుతుండే వాడు. నిహారిక ఓ కాలేజీలో లాంగ్‌టర్న్ కోచింగ్ (మెడిసిన్) చేస్తోంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. తమిళనాడుకు చెందిన లారీ ఉప్పు లోడుతో హైదరాబాదులోని తిమ్మాపూర్‌కు వెళ్తుండగా మార్గంమధ్యలో చెట్ల వద్ద రోడ్డు పక్కన డ్రైవర్ నిలిపాడు. అక్కడ డ్రైవర్ వంట చేసుకుంటూ ఉండగా ఈ దుర్ఘటన జరిగింది. అక్కడ మలుపు ఉండటం, కారు వేగంగా వస్తుండటం కూడా ప్రమాదాలకు కారణాలని స్థానికులు తెలిపారు.

క్షతగాత్రులను కాపాడటంలో పోలీసులు కీలక పాత్ర

రోడ్డు ప్రమాదం జరిగిందన్న సమాచారం తెలియగానే ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. లారీ కింద ఇరుక్కున్న కారును లాగి క్షతగాత్రులను హుటాహుటిన 108లో కడప రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తీసుకెళ్లారు. పోలీసులు సకాలంలో స్పందించి సేవలందించారని స్థానికులు ప్రశంసించారు.

పోలీసుల కార్డన్ సెర్చ్ ఆపరేషన్


కడప తాలూకా పరిధిలో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో తారకరామనగర్‌లో ఎస్‌ఐ రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేశారు. కాలనీలోని అనుమానిత వ్యక్తుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోడల్ కాలనీలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌ను ఎస్‌ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి నిర్వహించారు.

బాలిక అదృశ్యంపై బాధితుల ఆందోళన


పోలీస్‌స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న బాధితులు

నందలూరు(రాజంపేట) : స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట నాగిరెడ్డిపల్లె గ్రామస్తులు ఆదివారం ఆందోళనకు దిగారు. వారు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగిరెడ్డిపల్లెకు చెందిన మల్లికార్జున తన కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఆరా తీసేందుకు బాధితులు పోలీసుస్టేషన్ వెళ్లారు.

అక్కడ పని చేస్తున్న ఓ కానిస్టేబుల్.. కనిపించకుండా పోయిన బాలికపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో బాధితులు ఆగ్రహావేశానికి గురయ్యారు. వారు పెద్ద సంఖ్యలో పోలీసుస్టేషన్ ఎదుటే బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ పుల్లయ్య, ఎస్‌ఐ అబ్దుల్ పోలీసుస్టేషన్‌కు చేరుకుని బాధితులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు.